బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం, 04 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ప్రభుత్వం మక్కలను కొనాల్సిందే




మిగతా 2లో..

## నగల దుకాణంలో పట్టపగలే లూటీ..



మిగతా 2లో..

# చీకటి జీవోను వెనక్కి తీసుకోవాలి..



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఘాటు లేఖ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు సర్కార్ కుట్ర
- ఇది 14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యావ్యవస్థ ధ్వంసం
- ప్రశ్నార్థకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డల భవిష్యత్తు
- కేసీఆర్ స్కీమ్‌లే కాదు.. వైఎస్ పథకాలకూ పాతర

హైదరాబాద్, మే 3 : కాంగ్రెస్ సర్కార్ జీవో 7ను జారీ చేసి 14 లక్షల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్ల రేవంత్ అసమర్థ పాలన.. విద్యావ్యవస్థను కుప్పకూల్చడమే గాక, ఇప్పుడు నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే కుటిల యత్నాలకు తెరలేపిందని విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా కొన్నేండ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్న ఫీజు

మిగతా 3లో..

# ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

- అధికారం ఎవరిని వరించేనో!..
- బెంగాల్‌లో హోరాహోరీ
- బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి కౌంటింగ్ నేడే
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభం



న్యూఢిల్లీ, మే 3: టీఎంసీ, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు ఫలి తం కీలకంగా మారిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనున్నది. మూడు అంచెల భద్రత వ్యవస్థ కలిగిన లెక్కింపు కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల్‌తో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలిసారిగా కౌంటింగ్ కేం ద్రాల్లోకి అనధికార ప్రవేశాన్ని నివారించడానికి ఎన్నికల సంఘం ఈసీఐఎన్‌ఈటీ ద్వారా క్యూర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవే శపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానా లకు 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఈసారి ఊహిం చని రీతిలో భద్రతా ఏర్పాట్లు జరిగాయి. ఫలితాల రోజు వరకు తీవ్ర వాగ్వాదం నెలకొంది. అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ రెండూ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. రెండు దశల్లో జరిగిన పోలింగ్ ఏప్రిల్ 29న ముగిసింది. స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారి రికార్డు స్థాయిలో 92.47 శాతం ఓటింగ్ నమోదైంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్తా నియోజక వర్గంలో తీవ్రమైన ఎన్నికల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ ఎన్నికలను ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. ఆ నియోజకవర్గంలోని మొత్తం 285 పోలింగ్ కేంద్రా లలో మే 21న రీపోలింగ్ జరగనున్నది. ప్రధాన ప్రతి పక్షం బీజేపీ నుంచి బలమైన

మిగతా 3లో..

## ప్రజల భద్రతపై ఎందుకింత నిర్లక్ష్యం?



- దొంగలు సవాల్ విసురుతుంటే పోలీసులు ఏం చేస్తున్నట్టు?
- మాజీ మంత్రి, గంగుల నిలదీత

మిగతా 2లో..

## గాలివాన బీభత్సం.. రైతన్న ఆగమాగం!



- పలు జిల్లాల్లో ఈదురుగాలుల వర్షం
- అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మక్కజొన్న
- మహబూబాబాద్ జిల్లా సూదనపల్లిలో పిడుగుపాటుకు ఒకరు మృతి, ఇద్దరికి అస్వస్థత
- ఖమ్మం-సూర్యాపేట రహదారిపై రైతుల ధర్నా

మిగతా 2లో..

# సులభంగా 'నీట్'



- కెమిస్ట్రీ, బయాలజీ కాస్త ఈజీ
- కొంచెం ఇబ్బంది పెట్టిన ఫిజిక్స్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- ఈ నెలాఖరులో ప్రాథమిక కీ.. జూన్‌లో ఫలితాల వెల్లడి

మిగతా 2లో..

# బతుకమ్మకుంటపై మాటల మంటలు



హైదరాబాద్, మే 03 : బతుకమ్మకుంటలో మాటల మంటలు చెలరేగుతున్నాయి. ఈ స్థలవివాదం సుప్రీంకోర్టు వరకు వెళ్లడం, హైకోర్టు ఉత్తర్వులను అమలుపరచాలంటూ సుప్రీం చెప్పినప్పటి నుంచి ఈ వివాదం మరింత జటిలంగా మారుతోంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రెస్‌మీట్ పెట్టి బతుకమ్మకుంటపై చేసిన వ్యాఖ్యలను ఆ స్థలం తనదేనంటూ న్యాయపోరాటం చేస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. భూవివాదం కోర్టులో ఉండగా ఒక ఐపీఎస్ అధికారి తన ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ ఎలా వ్యాఖ్యలు చేస్తారంటూ మండిపడ్డారుఅసలు కోర్టు ఎక్కడా భూ యాజమాన్యంపై ఇప్పటివరకు తీర్పు చెప్పలేదని అయినా కమిషనర్ రంగనాథ్ మాత్రం దీనిని వ్యక్తిగతంగా తీసుకుని భూమిపై తనకు హక్కులే లేవంటూ వ్యాఖ్యానించడం సరైంది కాదని సుధాకర్‌రెడ్డి అన్నారు. తన భూ యాజమాన్యానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. శనివారం రంగనాథ్ ప్రెస్‌మీట్ పెట్టి బతుకమ్మకుంటపై చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత తీవ్రం చేశాయి. సుప్రీంలో కేసు ఉండడంతో పాటు హైకోర్టులో కేసు నడుస్తుండగానే భూమిపై రంగనాథ్ మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. ఇదిలా ఉంటే సుప్రీంలో తీర్పు వచ్చిన వెంటనే

మిగతా 3లో..

# గ్రేటర్ @ 41.6 డిగ్రీలు



హైదరాబాద్, మే 03 : గ్రేటర్‌లో ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42డిగ్రీలకు చేరుకోవడంతో నగరం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. దీంతో మధ్యాహ్నం సమయంలో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27.6 డిగ్రీలు, గాలిలో తేమ 22శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

రానున్న వారం రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటి నమోద య్యే అవకాశాలున్నందున ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# హజ్ యాత్రికులపై 'ఇంధన' భారం



- రూ.10 వేలు అదనంగా చెల్లించాలని కేంద్రం ఉత్తర్వులు
- రాష్ట్రంలో 6,632 మందిపై అదనపు చార్జీల భారం
- మోదీ సరార్ వైఖరిపై యాత్రికుల అభ్యంతరం
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వివిధ మైనారిటీ సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, మే 3 : హజ్ యాత్రికులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం షాకిచ్చింది. ఇంధన కొరత సాకుతో ఒకొకరు రూ.10వేల చొప్పున అదనంగా చెల్లించాలని నిర్ణయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మోదీ సరార్ వైఖరిపై హజ్ యాత్రికుల్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నది. దేశంలో మూడు నెలలకు సరిపడా పుష్కలంగా ఇంధన

మిగతా 3లో..

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు..



హైదరాబాద్, మే 03 : దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని మొత్తం 824 నియోజకవర్గాల్లో నమోదైన ఓట్ల లెక్కింపు మే 4వ తేదీ సోమవారం రోజు ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కా నుంది. సాయంత్రం 4 గంటల కల్లా ఏ రాష్ట్రంలో ఎవరిది గెలుపనేది పూర్తిగా తెలిసి పోతుంది. తొలి గంటలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. కాగా, ఎగ్జిట్ పోల్స్ అంచనాలు రాష్ట్రాల వారీగా భిన్నంగా ఉన్నాయి.

మిగతా 2లో..

# బుల్డోజర్ బాధితులకు నీడనిస్తున్న కేసీఆర్ ఇండ్లు



- రెండున్నరేండ్లుగా మూసీ, హైడ్రా బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు
- బీఆర్ఎస్ హయాంలో నిరుపేదల కోసం లక్ష డబుల్ బెడ్రూం గృహాలు
- కేసీఆర్ ఇండ్లే కట్టలేదంటూ.. రాజకీయ విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు
- ముఖ్యమంత్రి, హైడ్రా కమిషనర్ అవే ఇండ్లను మంజూరు చేస్తూ ప్రకటనలు

హైదరాబాద్, మే 03 : కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలు సైతం ఆత్మగౌరవంతో బతకాలని డబుల్ బెడ్రూం ఇండ్లను ఇచ్చింది. మహానగర పరిధి లో ఏకంగా లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. హైడ్రా పేరుతో సామాన్యుడి ఇండ్లు కూల్చి వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తున్నది. మూసీ పేరిట నిరుపేదల ఇండ్లను నేలమట్టం

# ప్రజల భద్రతపై ఎందుకింత నిర్లక్ష్యం?



- దొంగలు సవాల్ విసురుతుంటే పోలీసులు ఏం చేస్తున్నట్టు?
- మాజీ మంత్రి, గంగుల నిలదీత
- సీఎం రేవంత్, బండి సంజయ్ రాజీనామా చేయాలి: కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, మే 3: ప్రజల భద్రత విషయంలో పోలీసులు, ప్రభుత్వం ఎందుకింత నిర్లక్ష్యం చూపుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. దొంగల కాల్పుల్లో గాయపడి కరీంనగర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్‌తో కలిసి పరామర్శించారు. పోలీసులు నాకాబంధీ పేరుతో వాహనదారులను వేధించడం కాకుండా, అసాంఘిక శక్తులు ఎక్కడైనా తిరుగుతున్నారా? అని పరిశీలించాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ఓ చిన్నపాప కిడ్నాప్ జరిగితే మూడు గంటల్లోనే సీసీ కెమెరాల సాయంతో పట్టుకున్నామని గుర్తుచేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటికి కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరిగిందంటే.. భద్రత ఉందా..? లేదా అన్న అనుమానం కలుగుతున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఇదేనా ప్రజలకు భద్రతా? అని ప్రశ్నించారు. ఈ ఘటనకు కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత అని పేర్కొన్నారు. సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పీఎంజే జ్యువెల్లరీ షాపులో దొంగలు కాల్పులు జరిపి దాడికి పాల్పడటం దురదృష్టకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ విచారం వ్యక్తంచేశారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు కరీంనగర్‌ను జల్లెడ పడుతున్నారని, దుండగులను పట్టుకుంటారనే నమ్మకం ఉన్నదని చెప్పారు. ఘటనకు 10 నిమిషాల ముందే షాపు సమీపంలో అభివృద్ధి పనుల్లో పాల్గొన్నానని చెప్పారు. దుండగులు దొంగతనం చేయడానికే చొరబడినట్టు తెలుస్తున్నదని, సిబ్బంది అడ్డుకోవడంతో ఒక బ్యాగును వదిలి వెళ్లారని తెలిపారు. దోపిడీకి గురైన ఆభరణాల విలువ పోలీసుల విచారణలో తేలుతుందని అన్నారు.

# నగల దుకాణంలో పట్టపగలే లూటీ..

- కరీంనగర్ పీఎంజే జ్యువెల్లర్స్‌లో దొంగల బీభత్సం



కరీంనగర్, మే 3: కరీంనగర్ నగరం నడిబొడ్డున, అత్యంత రద్దీగా ఉండే జ్యోతినగర్ ప్రాంతంలో, కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, పట్టపగలు సాయుధ దుండగులు నగల దుకాణాన్ని దోచుకున్నారు. జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీకి ఆదివారం ఉదయం 11 గంటలకు కస్టమర్లలా వచ్చిన ఐదుగురు దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి సినీ ఫక్కీలో దోపిడీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. దుండగులు ఒక్కొక్కరుగా దుకాణంలోకి వచ్చారు. ఆభరణాలు చూపించాలంటూ సిబ్బందిని మాటల్లో దింపారు. నలుగురు లోపలికి రాగా, ఐదో వ్యక్తి ప్రధాన ద్వారం వద్ద ఉన్నాడు. స్ట్రాంగ్ రూమ్ లాకర్ నుంచి నగలు తెచ్చిన సిబ్బంది వీరికి చూపించగా ఒక వ్యక్తి గన్ తీసి అందరూ లొంగిపోవాలని, లేదంటే కాల్చేస్తానని బెదిరించాడు. సిబ్బందిని అప్రమత్తం చేసిన షాపు ఇన్‌చార్జి ముస్తాక్, దుండగులను ప్రతిఘటించేందుకు ప్రయత్నించాడు.కానీ ఒక దుండగుడు అతనిపై కాల్పులు జరిపాడు. ఈ పెనుగులాటలో ఆయన తల పై భాగానికి దెబ్బ తగలడంతో అతడు అక్కడే కుప్పకూలాడు. ఆ దుండగుడు నగల దుకాణం సిబ్బంది కమలాసన్, రాజేశ్, మధూకర్‌పై కూడా కాల్పులు జరిపాడు. దీంతో సిబ్బంది భయభ్రాంతులకు గురికాగా.. అందరినీ ఒకే చోటకు తీసు కొచ్చి మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు కట్టివేశారు. మూతులకు ప్లాస్టర్ వేశారు. ఇద్దరు దుండగులు వీరికి కాపలా ఉండగా.. ముగ్గురు దుండగులు నగలను సర్దుకున్నారు. ఈ సమయంలో సిబ్బంది భయాందోళనకు గురై అరవడంతో దుండగులు అక్కడి నుంచి బయటకు వచ్చి అప్పటికే అక్కడ ఏర్పాటు చేసుకున్న బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌పై పారిపోయారు. దుండగులు మొత్తం మూడు సంచుల్లో నగలను నింపుకొన్నట్టు తెలుస్తుండగా, రెండు సంచులు అక్కడే పడేసి ఒక సంచిని మాత్రమే తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఉదయం 11.01 నుంచి 11.13 నిమిషాల మధ్య దొంగతనం జరిగిందని చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ఎనిమిది బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించి, ప్రతి పోలీస్‌స్టేషన్‌కూ సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. దోపిడీకి సంబంధించిన సీసీ ఫుటేజీతోపాటు నిందితుల ఫొటోలను విడుదల చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే, వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగలు నల్లరంగు పల్సర్ బైక్, తెల్లరంగు అపాచీ బైక్‌లపై సంచరిస్తున్నారని తెలిపారు. సీసీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా లేదా వారికి సంబంధించిన సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100, 8712670744, 8712670745 నంబర్లకు తెలుపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారికి లక్ష రూపాయల బహుమానం ఇస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు.

# ప్రభుత్వం మక్కలను కొనాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్
- హైవేపై బైఠాయించి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన



రేగొండ, మే 3 : రైతులు పండించిన మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి రేగొండలోని పరకాల- భూపాలపల్లి ప్రధాన జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధరకు మక్కలు కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతుల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. ప్రజలు తమ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేను నిలదీస్తే, వారిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రజా సమస్యల కంటే ఎమ్మెల్యే తన సొంత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాడని విమర్శించారు. ఈ నెల 6న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

# సులభంగా 'నీట్'

- కెమిస్ట్రీ, బయాలజీ కాస్త ఈజీ
- కొంచెం ఇబ్బంది పెట్టిన ఫిజిక్స్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- ఈ నెలాఖరులో ప్రాథమిక కీ.. జూన్‌లో ఫలితాల వెల్లడి



హైదరాబాద్, మే 3 : వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్(యూజీ) పరీక్ష విద్యార్థుల టెన్షన్‌ను దూరం చేసింది. ప్రశ్నలు సులభంగా రావడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. నీట్ యూజీ పరీక్ష ఆదివారం నిర్వహించగా, ఈసారి ప్రశ్నలు సులభంగా రావడంతో 720కి 720 మార్కులొచ్చే అవకాశాలున్నాయని శ్రీచైతన్య విద్యా సంస్థలనీట్‌శిక్షకుడు శంకర్‌రావు విశ్లేషించారు. బయాలజీ సబ్జెక్ట్ చాలా సులభంగా ఉన్నట్టు చెప్పారు. అన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ సిలబస్ నుం చే ఇచ్చారని తెలిపారు. కాన్సెప్ట్ బాగా చదివిన విద్యార్థులు సులభంగా రాయగలరని అభిప్రాయపడ్డారు.

**కాస్త కఠినంగా ఫిజిక్స్..** ఈ సారి ఫిజిక్స్ ప్రశ్నపత్రం కాస్త కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు చెప్పారు. నిరుటి పోల్చితే ఈసారి కాస్త సులభంగానే ఉందని కొంతమంది తెలిపారు. 45 ప్రశ్నల్లో 30-35 ప్రశ్నలు సాధారణ విద్యార్థులు ఆన్సర్లు చేసేవిగా, మిగతావి చేసేందుకు కాస్త సమయం పట్టినట్టు చెప్పారు.కెమిస్ట్రీ విభాగం ప్రశ్నలు సులభంగా రాగా, మూడు, నాలుగు ప్రశ్నలు మాత్రం కొంచెం ఇబ్బంది పెట్టినట్టు వెల్లడించారు. 2025తో పోల్చితే ఈ సారి కొంత ఈజీగా ఉన్నందున విద్యార్థులు ఉపశమనం పొందారు. పరీక్ష కోసం రాష్ట్రంలో 199 సెంటర్లు ఏర్పాటు చేయగా 71,500(97శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారులు ప్రకటించారు.

**470 మార్కులకు సీటు..** ప్రశ్నపత్రం సులభంగా ఉండటంతో కటాఫ్ మార్కులు 70 వరకు పెరగనున్నాయి. నిరుడు తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు 405 మార్కులకు వచ్చింది. ఈ ఏడాది 470- 480 మార్కులకు వచ్చే అవకాశాలున్నాయి. నీట్ క్వాలిఫైయింగ్ మార్కులు 150-155 మార్కుల మధ్య ఉండే చాన్స్ ఉన్నది. ఈనెల చివరి వారంలో ప్రాథమిక కీ విడుదల, జూన్ రెండో వారంలో ఫలితాలు విడుదలకానున్నాయి.

ఐదేండ్లుగా అత్యధిక మార్కులు..

| సంవత్సరం | మార్కులు |
|---|---|
| 2026 | 720 |
| 2025 | 680 |
| 2024 | 720 |
| 2023 | 715 |
| 2022 | 720 |

# గాలివాన బీభత్సం.. రైతన్న ఆగమాగం!



- పలు జిల్లాల్లో ఈదురుగాలుల వర్షం
- అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మక్కజొన్న
- మహబూబాబాద్ జిల్లా సూదనపల్లిలో పిడుగుపాటుకు ఒకరు మృతి, ఇద్దరికి అస్వస్థత
- ఖమ్మం-సూర్యాపేట రహదారిపై రైతుల ధర్నా

హైదరాబాద్, మే : రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగా లులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచింది. తీవ్రమైన గాలులతో పలుచోట్ల చెట్లు, కరెంటుస్తంభాలు నేలకొరిగాయి. ఇండ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. నల్లగొండ జిల్లా పెద్దవూర, అనుముల, త్రిపురారం, మిర్యాలగూడ, నేరడుచర్ల మండలాల్లో భారీ వర్షం పడింది. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరాకు, రాకపోకలకు అంతరాయం కలిగింది. సంద్రోన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. చెన్నూర్‌లో చెట్లు విరిగిపడ్డాయి.కోటపల్లి, సర్వాయిపేట, పారుపల్లి, షట్‌పల్లిలో ధాన్యం తడిసింది. రాపనపల్లిలో ఆరె సంతు అనే వ్యక్తి ఇంట్లోని తాటి చెట్టుపై పిడుగుపడింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతుండగా నీలం వెంకన్న అనే కార్మికుడు పిడుగుపాటుతో మృతిచెందాడు. ఇద్దరు రైతులు అస్వస్థతకు గురయ్యారు. కౌసల్యాదేవిపల్లిలో రెండు మేకలు మృతి చెందాయి. శనిగపురం, ఈదులపూసపల్లి, ముడుపుగల్, అయోధ్య, మల్యాల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. గాలికి ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలోని రేకుల షెడ్డు ఎగిరిపోయింది. కేసముద్రం మారెట్ యార్డులో మకజొన్న, ధాన్యం తడిసిపోయాయి. తాళ్లపూసపల్లిలో బత్తిని సమ్మయ్యకు చెందిన మూడు కాడెడ్లు పిడుగుపాటుతో మృతి చెందాయి.డోర్నకల్, బయ్యారం, గార్ల, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసింది. దంతాలపల్లి, చిన్నగూడూరులో పంటలకు నష్టం వాటిల్లింది. వరంగల్ జిల్లా నెక్కొండలో 80 వేల బస్తాల మక్కలు వర్షార్పణమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. హుస్నాబాద్‌మార్కెట్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం, మక్కలు కొట్టుకుపోయాయి. కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. సైదాపూర్ మండలం రాయికల్‌తోపాటు పలు గ్రామాల్లో వడగండ్లకు వడ్లు రాలిపోయాయి.ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని మక్కజొన్న, వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో వడగండ్ల వాన పడింది. సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై వేలాది క్వింటాళ్ల ధాన్యం, మక్కలు నీటి పాలయ్యాయి. మామిడితోటల్లో మామిడికాయలు నేలరా లాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో రోడ్లపై ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది.కరకగూడెం మండలంలో చెట్లు నేలకొరి గాయి. అనంతారం, కరకగూడెం, పద్మాపురం, గొల్లగూడెం గ్రామాల్లో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కరకగూడెం నుంచి బైక్‌పై మొగిలితోగుకు వెళ్తున్న కొమరం నరసింహారావుపై పద్మాపురం సమీ పంలో చెట్టుకొమ్మ విరిగి మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పినపాక మండలం గోపాలరావుపేట, కిష్టాపురం, జానంపేట, తోగ్గూడెంలో విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. కారేపల్లి మండలం మాదారంలో మక్కజొన్న తడిసింది. గత 20రోజులుగా కొనుగోలు కేం ద్రాల్లోని ధాన్యం, మక్కలను కొనుగోలు చేయకపోవడంపై అన్నదా తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంజిల్లా ఎదులాపురం మున్సి పాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సూర్యాపేట- ఖమ్మం జాతీయ రహదారిపై మక్కజొన్న రైతులు ధర్నాకు దిగారు. మద్దులపల్లి కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ఆలస్యంకావడంతో ఆదివారం కురిసిన వర్షానికి పంట తడవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు.

# 'ఫీజు' పథకం ఎత్తివేసేందుకు కుట్ర



- విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం
- జీవో -7ను వెంటనే ఉపసంహరించుకోవాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హనుమకొండ, మే 3 : ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని, అందులో భాగంగానే జీవో 7 తీసుకొచ్చిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదని మండిపడ్డారు.ఈ నెల 6న వరంగల్ వేదికగా జరుగుతున్న రైతు సంగ్రామ సదస్సు తర్వాత కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లాంటి మిగతా డిక్లరేషన్లపై పోరాడుతామని చెప్పారు. రూ. 13వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయని, ప్రభుత్వం విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోమని చెప్తూ దాన్ని ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఫీజుల వసూలు కోసం తెచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# జూపల్లి.. ఝూటా మాటలు ఆపు


- 1,600 ఎకరాలు కాపాడినట్లు పచ్చి అబద్ధాలు
- దొంగే.. దొంగ' అన్నట్టు జూపల్లి కృష్ణారావు వ్యవహారం
- బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, మే 3 : మంత్రి జూపల్లి కృష్ణారావు అబద్ధపు మాటలు ఆపి, నిజాలు మాట్లాడాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కొల్లాపూర్ సంస్థానాధీశులకు చెందిన 1,600 ఎకరాల భూమిని కాపాడానని ప్రెస్‌మీట్‌లో పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆలయ, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఆయన, దొంగే.. దొంగా అన్న చందంగా వ్యవహరించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత అభిలాష్ రంగినేనితో కలిసి ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ సంస్థానాధీశులకు చెందిన 1,600 ఎకరాల భూమిని రక్షించింది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. 2021లో ఎమ్మెల్యేగా ఉన్న తాను కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు గుర్తుచేశారు.కానీ జూపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాస్‌బుక్‌లు జారీ చేసింది వాస్తవంకాదా? బీఆర్ఎస్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ ద్వారా పాస్ బుక్కులను రద్దు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. జూపల్లి రాజకీయ లబ్ధికోసం దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'కొల్లాపూర్ వద్ద ఎల్లాపురంలో 44 ఎకరాల సీలింగ్ అటవీ భూములను రికార్డులు మార్చి విక్రయించారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లను కొట్టి ప్లాట్లు పెట్టి అమ్ముకున్నారు. దేవా లయ భూములను కూడా తెగనమ్ముకున్నారు'అని సంచలన ఆరోపణలు చేశారు. స్థానికులు ఆయనపై సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. దమ్ముంటే కొల్లాపూర్‌లో భూ ఆక్రమ ణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరోసారి తమపై అభాండాలు వేస్తే ఊరుకోబోమని, కోర్టుకు లాగుతామని హెచ్చరించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

## ఏఐఎస్ఎఫ్ నేతలు కసిరెడ్డి లక్ష్మణ్




హైదరాబాద్, మే 3 : ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. హైదరా బాద్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.ఫీజు పథకంపై, స్కాలర్‌షిప్ బకాయిలపై ప్రభుత్వం పూటకో తీరుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఫీజు బకాయిలను సర్కార్ ఎప్పుడు విడుదల చేస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జీవో 7 ద్వారా డీబీటీ పద్ధతిలో విద్యార్థుల ఖాతాల్లో ఫీజును ఏఏ విడతల్లో విడుదల చేస్తుందో చెప్పాలని కోరారు. కళాశాలలకు ఫీజులను సకాలంలో వేయని సర్కార్.. విద్యార్థుల ఖాతాల్లో వేస్తుందన్న నమ్మకం లేదని తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## మారం జగదీశ్వర్

హైదరాబాద్, మే 3 :ప్రభుత్వ ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగ జేఏసీ కృషి చేస్తున్నదని, ఈ విషయమై ప్రభుత్వంతో మాట్లాడినట్టు టీఎన్జీవో రాష్ట్ర సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. ఆదివారం గోపన్‌పల్లిలోని బీటీఎన్జీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, దివంగత బంగారు స్వామినాథం విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భాగ్యనగర్ టీఎన్జీవోస్(గచ్చిబౌలి) మ్యుచువల్ ఎయిడెడ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చినట్టు చెప్పారు. గోపన్‌పల్లిలోని బీటీఎన్జీవోల స్థలవివాదానికి సంబంధించిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం కానున్నట్టు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంటపై మాటల మంటలు

కాంగ్రెస్ నేత వీహెచ్ బతుకమ్మకుంట వద్ద ధర్నాచేసి కోర్టు తీర్పుపై మాట్లాడిన తీరు కూడా చర్చనీయాంశమైంది. బతుకమ్మకుంట కేవలం వీహెచ్ కళ్లల్లో ఆనందం చూడడంకోసం సీఎం రేవంత్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహకారంతో చేస్తున్న వ్యవహారం అంటూ ఎల్ల సుధాకర్‌రెడ్డి మొదటినుంచి అంటున్నారు.

## చీకటి జీవోను వెనక్కి తీసుకోవాలి..

రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను రద్దుచేసేందుకు రేవంత్ ప్రభుత్వం భయంకరమైన కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని, జీవోను వెనక్కి తీసుకొని వెంటనే విద్యార్థిలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ సదుద్దేశంతో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాజకీయాలకతీతంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కరోనా కాలంలోనూ నిరంతరాయంగా నిధులు విడుదల చేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కానీ రేవంత్ గద్దెనెక్కిన వెంటనే ఈ బృహత్తర పథకానికి గ్రహణం పట్టిందని దుమ్మెత్తిపోశారు. ఈ చేతగాని సర్కార్ సొంత పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీమ్‌కే తూట్లు పొడుస్తున్నదని దుయ్యబట్టారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టిన కాంగ్రెస్, జీవో 7 ద్వారా ఫీజుల పథకాన్ని సమాధి చేసేందుకు కంకణం కట్టుకున్నదని నిప్పులుచెరిగారు. విద్యకోసం చేసే ఖర్చును ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా చూడాలి తప్ప, భారంగా భావించి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని తూర్పారబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఎక్కువగా నష్టపోయేది సమాజంలోని అట్టడుగు, బలహీనవర్గాల పిల్లలేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌పై కత్తిగట్టిందని కేటీఆర్ విమర్శించారు. ఈ పథకం ఆధారంగా నడుస్తున్న రాష్ట్రంలోని 2,500 పైగా ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు బకాయిలు చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరిట కొంతకాలం, ట్రస్ట్, టోకెన్ల ముసుగులో ఇంకొంత కాలం, కమిటీల పేరిట మరికొన్ని రోజులు మభ్యపెట్టిందని మండిపడ్డారు. చీకటి జీవో జారీ చేసి చివరికీ అసలుకే ఎసరు తెచ్చిందని నిప్పులు చెరిగారు.కాంగ్రెస్ ప్రభుత్వం దివాలాకోరు విధానాలను చూసి విద్యార్థిలోకం అసహ్యించుకుంటున్నదని తెలిపారు. పెద్దమొత్తంలో ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో గత్యంతరంలేక కాలేజీలు బంద్‌పెట్టి ఆందోళనకు దిగిన యాజమా న్యాలపై విజిలెన్స్ దాడులు చేసి వేధించారని విమర్శించారు. చివరికి రూ. 1,207 కోట్ల విలువతో ఇచ్చిన టోకెన్లకు నేటికీ దిక్కులేకుండా పోయిందని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సిన నిధులకు రెండున్నరేండ్లుగా బ్రేకులు వేయడం వెనుక ఉన్న అసలు కుట్ర ఇప్పుడు బట్టబయలైందని ధ్వజమెత్తారు. 30 నెలలుగా మూడు పైసలు కూడా విడుదల చేయని ప్రభుత్వం, ఇప్పుడు విద్యార్థుల ఖాతాలో నేరుగా ఫీజులు జమచేస్తామని నమ్మబలు కుతూ మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. 'అయినా విశ్వసనీయత కోల్పోయిన మీ సర్కార్ చెప్పే బూటకపు మాటలను నమ్మేదెవరు? మీ చేతలకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో జీరో వాల్యూ.. 2026-27 విద్యా సంవత్సరానికి తెచ్చిన మార్గదర్శకాలు ఫీజు పథకాన్ని శాశ్వతంగా సమాధి చేసే మరణ శాసనాలుగా కనిపిస్తున్నయ్..ఇలాంటి కొర్రీలతో తమ పిల్లలకు కాలేజీల్లో కనీసం అడ్మిషన్లు దొరుకుతాయా? లేదా? అనే భయం పేద తల్లిదండ్రులను వెంటాడుతున్నది'అంటూ లేఖలో విమర్శనాస్త్రాలు సంధించారు. 'విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజు భారాన్ని మోపి, వారిని అప్పులపాల్జేసే కుట్రలను తెలంగాణ సమాజం సహించబోదు..బీఆర్ఎస్ ఉపేక్షించబోదు' అని హెచ్చరించారు. రూ.10 వేల కోట్ల బకాయిలు విడుదల చేసేదాకా వదలబోమని తేల్చిచెప్పారు.

## హజ్ యాత్రికులపై 'ఇంధన' భారం

నిల్వలు ఉన్నాయని చెబుతూ వస్తున్న కేంద్రం పవిత్ర యాత్రకు వెళ్లేవారిపై భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సౌదీ అరేబియాలోని మకా మదీన యాత్రకు ఏటా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 2 లక్షల మందికిపైగా ముస్లింలు వెళ్తుంటారు. నాలుగైదు నెలల క్రితమే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమ వుతున్నది.హజ్ కమిటీలఆధ్వర్యంలో జనవరిలో దరఖాస్తులు స్వీకరించి స్రూటిని పూర్తి చేసి అర్హులను ఎంపిక చేస్తారు. యాత్రకు ఎంపికైనవారు రూ.3.6 లక్షల చొప్పున చెల్లిం చాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఈ ఏడాది 6,632 మంది యాత్రికులను ఎంపిక చేశారు.వీరంతా సోమవారం ప్రత్యేకవిమానాల్లో బయల్దేరి వెళ్తారు. నిరుపేదలైన అనేకమం ది యాత్రికులు దాతల సహాయంతో మక్కా యాత్ర చేస్తారు. ఇపుడు కేంద్రం అదనంగా రూ.10వేలు చెల్లించాలని నిర్దేశించడంతో దాతలపై ఆధారపడే యాత్రికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఇంధన కొరత పేరిట తమను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని మక్కా యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదనపు భారాన్ని ఉపసంహరించుకోవాలని మై నార్టీ సంఘాల నాయకులు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వమైనా ముందుకొచ్చి ఆర్థిక భారాన్ని భరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.హజ్ యాత్రికులపై కేంద్రం ఏటీఎఫ్ చార్జీల పేరిట రూ.10 వేలఅదనపు భారంమోపడం సరికాదని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యా కూబ్‌పాషా పేర్కొన్నారు. దాతల సహాయంతో మక్కాకు వెళ్లే నిరుపేద ముస్లింలు అదనపు సొమ్ము చెల్లించడంఇబ్బందికరంగామారుతుందన్నారు.ఇంధన చార్జీలు ఉపసంహరించు కొనేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, లేదంటే రాష్ట్రం నుంచి వెళ్లేవారికి సంబంధించిన భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.


## బుల్డోజర్ బాధితులకు నీడనిస్తున్న కేసీఆర్ ఇండ్లు

చేసి వారిని డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చి ఆదుకుంటున్నామని గొప్పలు చెప్పుకొంటున్నది. రెండు ప్రభుత్వాల మధ్య ఎంత తేడా?! పేదరికమే అర్హతగా కేసీఆర్ ప్రభుత్వం ఆత్మగౌరవ ఇండ్లను మంజూరు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం సర్కార్ బుల్డోజర్ కింద నిర్మాణాలు నలిగిపోవడమే ప్రాతిపదికగా అవే డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేస్తున్నది. అందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ ఒక పండుగలా నిర్వహిస్తే... ఇప్పుడు అదే ఇండ్ల పంపిణీ గాయం చేసిన వాళ్లే ఆయింట్‌మెంట్ రుద్దినట్లుగా కనిపిస్తున్నది. కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదంటూ విమర్శించిన నోటితోనే బుల్డోజర్ బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నారు.

### రంగనాథ్ వర్సెస్ సుధాకర్‌రెడ్డి..!

హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ చేపట్టిన చర్యలపై సుప్రీం సైతం ఆయన చర్యలను తప్పుపట్టింది. హైకోర్టు తాను ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తూ భూమి రూపురేఖలు మార్చడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రంగనాథ్ పత్రికా సమావేశం పెట్టి బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువేనని, ఇందుకు సంబంధించిన శాటిలైట్, గూగుల్ మ్యాప్స్‌తో చారిత్రక ఆధారాలను చూపిస్తున్నానని చెప్పడంపై సుధాకర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ల్యాండ్ నేచర్ అనేది రెవెన్యూ రికార్డులైనటు వంటి సేల్ డీడ్, సేత్వారీ, టీఎర్ఎల్ఆర్, పట్టా పాస్‌బుక్, విలేజ్ మ్యాప్ వంటి వాటి ద్వారా గుర్తించబడుతుందని వెల్లడించారు. దీని ప్రకారం వివాదాస్పద భూమి మెట్ట/ఖాళీ భూమి(వెకెంట్ ల్యాండ్) అని గుర్తించబడిందని చెప్పారు.


## ఘోర అగ్నిప్రమాదం.. 9 మంది మృతి



**హైదరాబాద్, మే 03 :** ముషీరాబాద్ బోలక్‌పూర్‌లోని ప్లాస్టిక్ గోదా ముల్లో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమా దం సంభవించింది. గోదాములు ఒక దాని కొకటిఆనుకొని ఉండటంతో మంటలు వేగం గా వ్యాపిస్తున్నాయి. దట్టమైన పొగలు కమ్ము కోవడంతో స్థానికులు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది చుట్టుపక్కల ఇండ్లను ఖాళీ చేయిం చారు. పలు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమి స్తున్నా రు. మంటలు ఇంకా అదుపులోకి రాలేదు.

# హోర్ముజ్ జలసంధింపై కొత్త నియమాలు

- పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు
- ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన



**టెహ్రాన్,మే3 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం, ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్టు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, 'పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం' అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యా యని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

# ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)..

సవాలును ఎదుర్కొన్న అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) వరుసగా నాలుగోసారి గెలవాలని ఆశిస్తుండగా 2021 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన సీపీఎం, కాంగ్రెస్ తిరిగి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. హుమాయున్ కబీర్ నేతృత్వంలోని ఏజేయూపీ, అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం కూడా కొన్ని కీలక ప్రాంతాలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఇదివరకు మొత్తం 87 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ప్రకటించగా అ సంఖ్యను 77కు తగ్గించింది. 2021లో మొత్తం 107 కౌంటింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది.అయితే ప్రస్తుత కౌంటింగ్ సందర్భంగా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఈసీ ఏర్పాటు చేసింది. కౌంటింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేశామని ఈసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 165 అదనపు కౌంటింగ్ పరిశీలకులను, 77 పోలీసు పరిశీలకులను ఈసీ నియమించింది. రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు మినహా మిగతా వారికి మొబైల్ ఫోన్లను నిషేధించడం సహా లెక్కింపు కేంద్రాల వద్ద కఠినమైన ప్రవేశ నియంత్రణ చర్యలను ఈసీ ప్రవేశపెట్టింది. అస్సాంలో హ్యాట్రిక్ సాధించగలమని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఆశిస్తున్నది. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ధారించే ఈవీఎంలను 35 జిల్లాలోని 40 కౌంటింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం తెరవనున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత కోసం 25 కంపెనీల (ఒక్కోదానిలో దాదాపు 100 మంది సిబ్బంది) సీఆర్‌పీఎఫ్ దళాలను ఈసీ నియమించింది. రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగగా 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల బరిలో ఉన్న ప్రముఖులలో బీజేపీకి చెందిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ఉన్నారు. కేరళలో 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికలలో తన పనితీరుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్)ను గద్దె దించాలని ఆశిస్తుండగా, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ రాష్ట్రంలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్నది. ఎల్‌డీఎఫ్ ఓటమి పాలైతే 1960ల తర్వాత ఏ భారత రాష్ట్రంలోనూ వామపక్ష పార్టీలు అధికారంలో లేకుండాపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. రాష్ట్రంలోని 140 సీట్ల కోసం మొత్తం 883 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 43 ప్రదేశాలలో 140 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పోటీలో లేనప్పటికీ 2021లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కేరళలో తమ ఉనికిని విస్తరించుకోవడానికి ఈ ఎన్నికలను కీలకమైనవిగా భావిస్తున్నది. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే, దాని ప్రధాన ప్రత్యర్థి ఏఐఏడీఎంకేతోపాటు నటుడు-రాజకీయవేత్త విజయ్ నేతృత్వంలోని టీవీకే, తమిళ జాతీయవాది సీమాన్ నేతృత్వంలోని ఎన్‌టీకే వంటి కొత్త పార్టీల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలిపోనున్నది. వరుసగా రెండోసారి అధికారాన్ని చేపట్టాలని డీఎంకే ఆశిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 62 కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రత నడుమ సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. ఈవీఎంల కోసం 234 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం అదనంగా 240 హాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఏఐఏడీఎంకే, బీజేపీ, ఐఎన్ఆర్‌సీ, ఎల్‌జేకే పార్టీలు ఎన్‌డీఏ కూటమిలో ఉండగా కాంగ్రెస్, డీఎంకే, వీసీకే పార్టీలు ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్నాయి. విజయ్ సారథ్యంలోని టీవీకే ఒంటరిగా పోటీ చేసింది. కేంద్ర పాలిత ప్రాం తమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ జరగగా రికార్డు స్థాయిలో 91.23 శాతం ఓట్లు పోలయ్యాయి. 2021 ఎన్నికల్లో 16 స్థానాలు గెలుచుకుని కచ్చితమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఎన్‌డీఏ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కూడా గెలుపును ఆశిస్తున్నది. గోవా, కర్ణాటక, నాగాలాండ్, గుజరాత్, మహారాష్ట్రలోని 8 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఓట్ల లెక్కింపు జరగనున్నది. గోవాలోని పోండ, కర్ణాటకలోని బాగల్‌కోట్, దావణగెరె, నాగాలాండ్‌లోని కోరిదంగ్, త్రిపురలోని ధర్మనగర్, గుజరాత్‌లోని ఉమ్రీత్, మహారాష్ట్రలోని రహూరీ, బారామతి స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి.

# ఒప్పందం చేసుకోండి..లేకుంటే విపత్తే

- ట్రంప్ బెదిరింపులు
- దౌత్యమా..యుద్ధమా.. నిర్ణయించుకోవాల్సింది అమెరికానే : ఇరాన్
- కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, యుద్ధం ముంచుకొచ్చే ప్రమాదం



**న్యూఢిల్లీ, మే 03 :** అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌పై మళ్లీ దాడి చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో పాటు మూడు కీలక అంశాలైన అణు కార్యక్రమం, హోర్ముజ్ దిగ్బంధనం, భద్రతా హామీలు వంటి అంశాలపై ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు ట్రంప్ ను ఏమాత్రం నమ్మలేమని ఇరాన్ అంటోంది. సముద్రపు దొంగల్లాంటి వాళ్లమంటూ ప్రకటనతో కూడా ఇరాన్ మరింత అప్రమత్తమైంది. అందుకే మా వ్యూహాల్లో మేం ఉన్నామంటూ ప్రతిస్పందిస్తోంది. దీంతో యుద్ధం జరగవచ్చనే భయాన్ని రేకెత్తిస్తోంది. ప్రతి వారం కొత్త సవరణలతో ప్రతిపాదనలు వస్తున్నా, ఏవీ ఆమోదం పొందడం లేదు. ఇరాన్ ఒకప్పుడు ఉన్నంత బలంగా ఇప్పుడు లేదని ట్రంప్ అంటున్నారు. ఆయన ప్రకారం, వారికి ఒప్పందం కావాలి. వారు పూర్తిగా బలహీనపడ్డారు. తమ నాయకుడు ఎవరో కూడా వారికి అర్థం కావడం లేదు. వారు నిస్సహాయులు. అని యూఎస్ అధ్యక్షుడు పేర్కొంటున్నారు. ఒప్పందం కుదరకపోతే ఏమి జరుగుతుందనేదే అతిపెద్ద ప్రశ్న. సైనిక చర్య ఒక ప్రత్యామ్నాయం అని ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు."నేను ఇప్పుడే చెప్పలేను, కానీ వారు తప్పుడు నిర్ణయం తీసుకుంటే, అది సాధ్యమే" అని ఆయన అన్నారు. అమెరికా దాడి చేసే అవకాశాన్ని తెరిచి ఉంచుకుంటోందని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఇదిలా ఉండగా, హోర్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు తీవ్రమవుతూనే ఉన్నాయి. అమెరికా దిగ్బంధనం ఇరాన్ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపింది. ఇరాన్‌పై సైనిక చర్యకు అవకాశం ఉన్నదని ట్రంప్ సూచనప్రాయంగా చెప్పారు. 'వారి ప్రవర్తన సరిగా లేకపోతే, వారు చెడ్డ పని చేస్తే ఏం చేయాలో చేస్తాం. సైనిక చర్యకు అవకాశం ఉంది కచ్చితంగా' అని ఆయన ఫ్లోరిడాలో తెలిపారు. కాగా ఇరాన్‌పై యుద్ధం చేయడానికి తనకు కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా చట్టం ప్రకారం సైనిక చర్య చేపట్టాలంటే దేశాధ్యక్షుడికి ప్రతినిధిసభ అనుమతి తప్పనిసరి. అయితే ట్రంప్ తాజాగా కాంగ్రెస్ సభ్యులకు లేఖ రాస్తూ యుద్ధ అధికారాల చట్టానికి తాను కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 7వ తేదీ నుంచి కొనసాగుతోందని, కాబట్టి ఫిబ్రవరి 28న ప్రారంభమైన శత్రుత్వం ముగిసిందని గుర్తు చేశారు. ఇదిలావుండగా హోర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్‌కు వ్యక్తులు కానీ, కంపెనీలు కానీ టోల్ చెల్లిస్తే తమ ఆంక్షలను ఉల్లంఘించినట్లు అవుతుందని అమెరికా ఆర్థిక శాఖ ఓ నోటీసులో హెచ్చరించింది. జాతీయ ఇరాన్ ట్యాంకర్ కంపెనీ (ఎన్ఐటీసీ)కి చెందిన అతి పెద్ద ముడి చమురు రవాణా నౌక సూపర్‌ట్యాంకర్ అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని ఆసియాపసిఫిక్ ప్రాంతంలోకి విజయవంతంగా ప్రవేశించింది. ఈ నౌకలో 1.9 మిలియన్ బ్యారల్స్ ముడి చమురు ఉంది. ఈ ట్యాంకర్ ప్రస్తుతం ఇండొనేషియాలోని లాంబక్ జలసంధి మీదుగా రియావూ ద్వీపసమూహం వైపు ప్రయాణిస్తోంది. ఈ నౌక వారం రోజుల క్రితం శ్రీలంక తీరంలో కన్పించిందని ట్యాంకర్ ట్రాకర్స్.కామ్ తెలిపింది. కనీసం 52 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని విజయవంతంగా ఉల్లంఘించాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా గత నెల 29న తెలియజేసింది.

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

### మరోమారు మెలిక పెట్టిన ట్రంప్

**వాషింగ్టన్,మే3 :** పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్లి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

## సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు

### కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం

**న్యూఢిల్లీ,మే3 :** సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.

## లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన

### ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా



**జమ్మూ,మే3 :** క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శ నార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్దార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# కపిల్ శర్మ కేఫ్‌పై మళ్లీ కాల్పులు..

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి హెచ్చరికలు! బాలీవుడ్ స్టార్ కమెడియన్, ప్రముఖ టెలివిజన్ హోస్ట్ కపిల్ శర్మకు చెందిన కెనడాలోని క్యాప్స్ కేఫ్‌పై మళ్లీ దాడి జరిగింది. ఇప్పటికే పలుమార్లు ఈ కేఫ్‌పై కాల్పులు జరగగా, తాజాగా జరిగిన ఈ ఘటన ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. కెనడాలో ఉన్న ఈ కేఫ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారు. కేఫ్ బయటతో పాటు పక్కనే ఉన్న మరో షాప్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరికి గాయాలయ్యాయనే విషయం స్పష్టంగా తెలియకపోయినా, అక్కడి ప్రాంతంలో భయాందోళన వాతావరణం నెలకొంది. ఈ దాడులకు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఈ గ్యాంగ్ కపిల్ శర్మను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగిన విషయం తెలిసిందే. కేఫ్ ప్రారంభమైన రోజే కాల్పులు జరపడం ద్వారా అల్లకల్లోలం సృష్టించారని, అనంతరం మరో రెండు సార్లు కూడా దాడులు చేసినట్లు సమాచారం. బాలీవుడ్ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతోందనే ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా డబ్బుల వసూళ్ల కోసం ఈ గ్యాంగ్ బెదిరింపులు చేస్తోందని చెబుతున్నారు. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు ఈ గ్యాంగ్ నుంచి బెదిరింపులు ఎదుర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. కపిల్ శర్మ కూడా గతంలో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే సరైన రీతిలో స్పందన లభించలేదనే



వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో తాజాగా జరిగిన కాల్పుల తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇక ఈ దాడి తర్వాత సోషల్ మీడియాలో ఒక ఖాతా ద్వారా షాకింగ్ హెచ్చరికలు వెలువడినట్లు తెలుస్తోంది. "ఇప్పటికైనా మా మాట వినకపోతే తదుపరి లక్ష్యం ముంబైలోని కపిల్ శర్మ నివాసం" అంటూ హెచ్చరించినట్లు సమాచారం. ఈ ఘటనతో బాలీవుడ్ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. విదేశాల్లో ఉన్న కపిల్ శర్మ ఆస్తులపై వరుసగా దాడులు జరగడం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రస్తుతం ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

# పెద్ది ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్..వరల్డ్ ఫస్ట్ షో ఎప్పుడు అంటే..!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ వచ్చేసింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చివరకు విడుదల తేదీని ఖరారు చేసుకుంది. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ పాన్ ఇండియా చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో ఘనంగా విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ కూడా విడుదలను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. అక్కడ వరల్డ్ ఫస్ట్ షో భారత కాలమానం ప్రకారం జూన్ 3 రాత్రి 9 గంటలకు ప్రదర్శించనున్నారు. దీనితో విదేశాల్లో ఉన్న తెలుగు ప్రేక్షకులు ముందుగానే ఈ సినిమా ఎంజాయ్ చేసే అవకాశం పొందుతున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ మే 7 నుంచి ప్రారంభం కానున్నాయి. రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ క్రేజ్ దృష్ట్యా ప్రీమియర్ షోలకే భారీగా టికెట్లు అమ్ముడవుతాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో ఈ చిత్రం రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేటెస్ట్ బజ్ ప్రకారం పెద్ది ట్రైలర్ ఈ మే 17 లేదా 18న రిలీజ్ చేయబోతున్నట్టు తెలుస్తుంది. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఇక మూవీ ప్రమోషన్స్ వేగం పెంచుతారు. మధ్య మధ్యలో మూవీకి



సంబంధించిన పాటలు, గ్లింప్స్ వదులుతూ సినిమాపై మరింత ఆసక్తి పెంచేలా ప్లాన్ చేస్తున్నారు. పెద్ది సినిమాకి వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తుండగా పాన్ ఇండియా లెవెల్లో చాలా గ్రాండ్ రిలీజ్ ని ఈ సినిమాకి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అలాగే శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ స్టార్ కాస్టింగ్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. మరో ముఖ్య ఆకర్షణగా నిలిచేది సంగీతం. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేకమైన హైలైట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో భావోద్వేగాలు, యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ కలగలిపి రూపొందుతున్న 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయం సాధిస్తుందా అనే ఆసక్తి అందరిలో ఉంది.

# బాక్సులు బద్దలయ్యే ఇంట్రడక్షన్?

దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) మెగా ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే దర్శకుడు బాబీ షూట్‌ని మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మెగాస్టార్ ఇంట్రడక్షన్ సీన్‌ని తీసేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారట. ఈ ఎంట్రీ సీక్వెన్స్ కోసం ప్రస్తుతం భారీ సెట్స్‌ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌లో మెగా స్టార్‌ని కొత్తగా చూపించేందుకు బాబీ



ప్రణాళికలు రచిస్తున్నారు. చిరంజీవితోపాటు మొత్తం నలభై మంది ఫైటర్స్ కూడా ఈ సీక్వెన్స్‌లో కనిపిస్తారట. కుటుంబ భావోద్వేగాలే ప్రధానంగా సాగే ఈ కథలో చిరంజీవి పాత్ర చిత్రణ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుందని సమాచారం. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమా అంతకు మించి ఉంటుందని డైరెక్టర్ టీమ్ చెబుతున్నది. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు.

# బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్..

కానీ ప్రియుడి పేరు మాత్రం సీక్రెట్‌గానే..! భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్- అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. "అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను" అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. "ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది. అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి



పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. "పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అనిపిస్తోంది" అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు.

# రాకాలో అక్షయ్‌కు మార్?



దేశంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పానిండియా చిత్రాల్లో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' ఒకటి. అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మాఫియా నేపథ్యంలో సాగే ఈ సైంటిఫిక్ థ్రిల్లర్‌లో దీపికా పదుకోన్ కథానాయిక. రష్మిక మందన్నా, జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలకపాత్రధారులు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ ఈ సినిమాలో ఓ ప్రత్యేకపాత్ర చేసేందుకు అంగీకారం తెలిపినట్టు తెలిసింది. వచ్చే షెడ్యూల్ నుంచి ఆయన ఈ సినిమా సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# గోపీచంద్ యాక్షన్ షురూ

హీరో టి.గోపీచంద్ కథానాయకుడిగా 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకునిగా పరిచయ మవుతున్నారు. మలయాళ నటి అనార్కలి నాజర్ కథానాయిక. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్-లక్ష్మణ్ కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి క్లాప్ కొట్టారు. మరో అగ్ర నిర్మాత దిల్ రాజు గౌరవ దర్శకత్వం వహించారు.



దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలు కేఎల్ దామోదరప్రసాద్, మైత్రీ రవిశంకర్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. అతిథులంతా చిత్రం బాగా రావాలంటూ ఆకాంక్షించారు. గోపీచంద్ కెరీర్‌లో ఇది 34వ చిత్రమని, అత్యున్నత నిర్మాణ విలువలతో, సాంకేతిక నైపుణ్యంతో కూడిన సరికొత్త కథను ప్రేక్షకులకు అందించనున్నామని, దర్శకుడు వి.వెంకట్ బలమైన స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, గోపీచంద్ పూర్తి యాక్షన్ అవతారంలో కనిపిస్తారని, ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్‌తో ఆయన పాత్ర సాగుతుందని, రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలుకానున్నదని మేకర్స్ తెలిపారు. ఈచిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్, ఎడిటింగ్: శ్రీకర ప్రసాద్.

# ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ 'భరతనాట్యం2

మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే



సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్థలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. క్రైమ్ కామెడీ మరియు ఫ్యామిలీ డ్రామా కలయికతో రూపొందిన ఈ మూవీ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది.